ప్రజాశక్తి

శుక్రవారం 21 మార్చి 2025

8 పేజీలు

విశాఖపట్నం | అనకాపల్లి





పోరుబాటలో చెరుకు రైతు

- కలిసి కదలనున్న కార్మికులు
- నేడు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద మహాధర్నా
- బిల్లులు, జీతం చెల్లించని యాజమాన్యం
- ప్రభుత్వం సహాయ నిరాకరణ
- పట్టించుకోని ఎంపీ, ఎమ్మెల్యేలు



మహాధర్నా ప్రచారంలో మాట్లాడుతున్న వివి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

గోవాడ సహకార సుగర్ ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసే రైతు, కార్మికులు ఏకమయ్యారు. జరుగుతున్న అన్యాయంపై నిరసన తెలపడానికి సిద్ధమయ్యారు. చెరుకు సరఫరా చేసినప్పటి నుంచి ఇంతవరకు టన్ను చెరుకుకు యాజమాన్యం పైసా బిల్లు చెల్లించలేదం. కార్మికులకు జీతం ఇవ్వలేదు. రాష్ట్రంలో ఏకైక సహకార సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆధునీకరించకపోగా, వదిలించుకోవాలని చూడ్డంతో రైతులు, కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ విధానాలతో ఫ్యాక్టరీ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. అయినా కనీస ఆర్థిక సహకారం ప్రభుత్వం అందించడంలేదు. క్రషింగ్ సామర్థ్యానికి తగినట్లు యంత్రాలను సిద్ధంచేయలేదు. తరచూ ఫ్యాక్టరీ మరమ్మతులకు గురవడంతో రైతులు యార్డుల్లో రోజులు తరబడి ఉండాల్సిన పరిస్థితి వస్తోంది. ఎక్కువ రోజులు ఎండలో చెరుకు ఉండడంతో బరువు తగ్గి రైతుకు నష్టం వాటిల్లుతోంది. అయినా వాటన్నింటినీ భరించి చెరుకు సరఫరా చేస్తున్నప్పటికీ, ఒక్క పైసా కూడా రైతుకు చెల్లించలేదు. గతేడాది బకాయి ఇవ్వలేదు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులకు జీతం చెల్లించలేదు. ఎంపీ సిఎం రమేష్, ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు వారి సమస్యలను పట్టించుకోలేదు. తమ బకాయిలు చెల్లించేలా యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చేందుకు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ పోరాట కమిటీ నేతృత్వంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద రైతులు, కార్మికులు మహాధర్నా చేపట్టనున్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రక్షణ రైతులు, కార్మికుల కర్తవ్యంగా మారింది.

రైతులకు బిల్లులు, కార్మికులకు జీతం చెల్లించక కుటుంబ అవసరాలకు అప్పులు మిగతా 2లో..

తక్షణమే బకాయిలు చెల్లించాలి

రైతులు, కార్మికులకు బకాయిలు చెల్లించాలి. గతంలో రైతుకు ఇచ్చిన రాయితీలన్నీ పునరుద్ధరించాలి. పూర్తి సామర్థ్యంతో ఫ్యాక్టరీని నడపాలి. ఫ్యాక్టరీని ఆధునీకరిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన మాట కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. యాజమాన్యం, ప్రభుత్వం రైతులు, కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తాం.



కర్రి అప్పారావు,
ఎపి చెరకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు

హిజ్రా హత్య కేసు నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - కశింకోట : హిజ్రా దీపు హత్య కేసులో పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం పొదలాడ గ్రామానికి చెందిన బండి దుర్గాప్రసాద్ అలియాస్ బన్నీ (24)ని కశింకోట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కశింకోట పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో అనకాపల్లి జిల్లా ఎస్‌పి తుహిన్‌సిన్హా మాట్లాడుతూ, నిందితుడు బన్నీ నాలుగేళ్లుగా హత్యకు గురైన దీపుతో సహజీవనం చేస్తున్నాడని తెలిపారు. బన్నీ ఇటీవల రెండో పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడటంతో వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయని చెప్పారు. హిజ్రా దీపుకు వివాహేతర సంబంధాలు ఉన్నాయన్న అనుమానం కూడా బన్నీకి ఉందని తెలిపారు. దీంతో దీపును హతమార్చాలని నాలుగైదు రోజులుగా బన్నీ పన్నాగం పన్నాడని వివరించారు. ఈ నెల 17వ తేదీన మునగపాక మండలం నాగులాపల్లిలో అద్దెకు నివాసముంటున్న ఇంట్లో కత్తితో నరికి దీపును బన్నీ హత్య చేశాడు. విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు దీపు శరీరాన్ని భాగాలుగా విభజించి కశింకోట మండలం బయ్యవరం, తాళ్లపాలెం, అనకాపల్లి వై.జంక్షన్ వద్ద మూటలు కట్టి పడేశాడని తెలిపారు. ఎనిమిది పోలీసు బృందాలు రంగంలోకి దిగి సీసీ ఫుటేజ్ ఆధారంగా హత్య జరిగిన 24 గంటల్లోపు నిందితుడు బన్నీని అరెస్ట్ చేసినట్లు వివరించారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులో పెట్టి నిందితుడు బన్నీకి త్వరితగతిన శిక్ష పడేలా చర్యలు చేపట్టామని తెలిపారు. మృతిచెందిన హిజ్రా కుటుంబానికి పరిహారం అందించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు, హోం మంత్రి అనిత చర్యలు చేపట్టారు పేర్కొన్నారు. హత్య కేసును త్వరితగతిని ఛేదించిన అనకాపల్లి డిఎస్‌పి శ్రావణి, కశింకోట సిఐ స్వామినాయుడు, ఎస్ఐలు మనోజ్, లక్ష్మణ్, సిబ్బందికి తుహిన్ సిన్హా అభినందనలు తెలిపారు.



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అనకాపల్లి జిల్లా ఎస్‌పి తుహిన్‌సిన్హా

స్టేడియానికి వైఎస్ఆర్ పేరు తొలగింపుపై ధర్నా

▶ వార్త మెయిన్ 3లో..

ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో సిఐఐ కృషి

▶ వార్త మెయిన్ 5లో..

దువ్వాడ- నౌపడ- పర్లాకిమిడి సెక్షన్ల పరిశీలన

▶ వార్త 3లో..



ప్రజలనడిగి సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు లోకనాథం

నేవీ ప్రభావిత రైతుల సమస్యలను పరిష్కరించాలి

వార్తలు 8లో..

పారిశుద్ధ్య పనిముట్లేవీ?

పరికరాలు లేక కార్మికుల అవస్థలు



తోపుడు బండి లేక చెత్తను తట్టలో ఈడ్చుకెళ్తున్న పారిశుధ్య కార్మికుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరంలో పారిశుధ్యం పూర్తిస్థాయిలో మెరుగుపడాలంటే తగినంత మంది పారిశుధ్య కార్మికులు, పనుల నిర్వహణకు అవసరమైన పనిముట్లు, పరికరాలు ఉండాలి. ప్రస్తుతం నగరంలో ఎక్కడ చూసినా పారిశుధ్య కార్మికులు విధి నిర్వహణలో పనిముట్లు లేక, పరికరాలు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటూ కనిపిస్తున్నారు. ఒకవైపు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మొదటి స్థానంలో ఉండాలని, ఇందులో పారిశుధ్య కార్మికులు కీలక భూమిక నిర్వహించాలని జివిఎంసి అధికారులు, పాలకవర్గం సభ్యులు అదే పనిగా ఆదేశాలు జారీ చేయడం, వెంటపడి పని చేయించడం చేస్తున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో జివిఎంసి పరిశుభ్రమైన నగరంగా గుర్తింపు రావాలని అధికారులు, కార్పొరేషన్ పాలకవర్గ సభ్యుల ఆదేశాలను దిగువ స్థాయిలో అమలు చేయడం కోసం, ప్రతి వార్డులో ఉదయం 6 గంటల నుండి శానిటరీ ఇన్‌స్పెక్టర్, లేదా జోనల్ కమిషనర్ ప్రత్యక్షంగా ఉండి పారిశుధ్య కార్మికులను పనిచేయమని తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. పనిచేయడానికి అభ్యంతరం లేదని, రోడ్లు ఊడ్చడానికి చీపుర్లు లేవు, చెత్త ఎత్తడానికి తోపుడు బళ్లు లేవు, కాలువలను శుభ్రపరచడానికి గడ్డపారలు అందుబాటులో ఉండటం లేదని కార్మికులు చెబుతున్నారు. వారి ఆవేదనను పట్టించుకోకుండా, పనిముట్లు, పరికరాలు సమకూర్చకుండా పనులు మాత్రం చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తూ, కార్మికులను తీవ్ర అనారోగ్య సమస్యలకు గురి చేస్తున్నారు. ఈ విషయాన్ని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు ప్రధాన వైద్యాధికారి, కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లారు. జోనల్ స్థాయిలో కూడా యూనియన్ నాయకులు జోనల్ కమిషనర్ల మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పోరుబాటలో చెరుకు రైతు

చేస్తున్నారు. ఈ నెల 10వ తేదీన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతుల సమస్యలు తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు... రైతులకు బిల్లు బకాయిలు, కార్మికులకు జీతం చెల్లించడానికి తక్షణ సాయం కింద రూ.35 కోట్లు ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అయినా ఈ ప్రభుత్వం చెవికి రైతుల బాధ విన్పించినట్లులేదు. రోజుకు నాలుగువేల టన్నుల సామర్థ్యంకల్గిన ఫ్యాక్టరీ 1500 టన్నులకు మించి క్రషింగ్ చేయడంలేదు. ఈ ఫ్యాక్టరీని ఆధునీకరిస్తే తప్ప తమకు శాశ్వత పరిష్కారం లభించదని రైతుకు అర్థమైంది. ఇందుకు రూ.350 కోట్లు ప్రభుత్వం సహాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పారిశుధ్య పనిముట్లేవీ?

దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లారు. అయినప్పటికీ పారిశుధ్య పనికి అవసరమైన పనిముట్లు, పరికరాలను సమకూర్చటంలో నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. జివిఎంసిలో జనాభా సంఖ్య గణనీయంగా పెరిగింది. అనకాపల్లి, భీమిలి మున్సిపాలిటీలను విలీనం చేయడంతో నగర పరిధి కూడా పెరిగింది. ఇవి కాకుండా కొత్తగా భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఆనందపురం, పద్మనాభం తదితర మండలాలను కూడా జివిఎంసిలో విలీనం చేయటానికి ఆ ప్రాంత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల ఆయా మండలాల ప్రజలు, ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించి, జివిఎంసిలో విలీనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. ఇప్పటికే నగర జనాభా 20 లక్షల నుంచి సుమారు 25 లక్షల మేరకు పెరిగింది. దీనిని దృష్టిలో పెట్టుకొని అదనంగా సిబ్బందిని నియమించాల్సి ఉండగా, ఏనాటి నుంచో ఉన్న సుమారు 5000 మంది కార్మికులతోనే పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం జివిఎంసిలో అదనపు పారిశుధ్య కార్మికులను నియమించాలి. కార్మికులకు అవసరమైన పారిశుధ్య నిర్వహణ పరికరాలను పూర్తిస్థాయిలో అందివ్వాలని సిఐటియు నాయకులు కోరుతున్నారు.

పిచ్చుకలను కాపాడాలి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : పిచ్చుకలను కాపాడే బాధ్యత అందరిదీ అని జనసేన ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యన్నారాయణ పేర్కొన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ నేతృత్వంలో గురువారం లాసన్స్ బే కాలనీలోని శాంతి ఆశ్రమంలో పిచ్చుకల కోసం గూళ్లు, నీటి కోసం మట్టి పాత్రలు, ధాన్యం కుచ్చులు ఏర్పాటుచేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పిచ్చుకల కోసం గూళ్లు, నీరు ఏర్పాటు చేయాలని తమ పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కల్యాణ్ ట్విట్టర్ ద్వారా పిలుపు మేరకు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం మాట్లాడుతూ "ప్రపంచ పిచ్చుకల దినోత్సవం" సందర్భంగా పిచ్చుకలకు గూళ్లు, మంచి నీటి పాత్రలు ఏర్పాటు చేయడం మన బాధ్యత అన్నారు. బియ్యం పిండితో ముగ్గులు వేయాలని కోరారు. పిచ్చుకలు ప్రకృతి ఆధారంగా పండించే పంటలకూ, మానవాళి మనుగడకూ ఉపకరిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో శాంతి ఆశ్రమం ప్రతినిధి లాయర్ ఆదిత్య, జనసేన నాయకులు పి.ఆదినారాయణ, పలువురు ప్రతినిధులు రమాదేవి, కేదార్శి, టి.నిఖిత, వి.భానుప్రసాద్, జె.రాజేశ్వరి, ఐ.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కాగడాల ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ 94వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 23వ తేదీన బీచ్ రోడ్డులో ఎస్‌ఎఫ్ఐ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన నిర్వహించనున్న కాగడాల ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఎస్‌ఎఫ్ఐ ఆంధ్ర యూనివర్సిటీ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ కమిటీ కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ, నిస్వార్థమైన ఉద్యమ స్ఫూర్తి ప్రదర్శించి అతి చిన్న వయసులోనే ప్రాణ తాగ్యం చేసి భారతీయుల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిన వారి త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న ఈ కాగడాల ప్రదర్శనలో విద్యార్థులు పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నాయకులు అజయ్, ఎల్‌జె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ ఎయు కమిటీ నాయకులు

ఉద్యోగ భద్రత కల్పించాలని మీటర్ రీడర్ల ధర్నా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నెలవారీ వేతనాలు అమలు చేయాలని కోరుతూ గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా ఉన్న విద్యుత్తు శాఖ ఎస్ఇ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్ల సంఘం (ఎఐటియుసి) ఆధ్వర్యాన గురువారం ధర్నా నిర్వహించారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శివారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎల్.రామకృష్ణ నాయకత్వంలో జరిగిన ధర్నాలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు, సహాయ కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్, మీటర్ రీడర్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శివారెడ్డి, జిల్లా అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ, విద్యుత్ సంస్థను నమ్ముకొని సుమారు 10 నుంచి 15 ఏళ్లుగా పనిచేస్తున్న మీటర్ రీడర్లను స్మార్ట్ మీటర్లు వస్తున్న తరుణంలో తొలగింపునకు పూనుకోవటం సరికాదన్నారు. వీరందరికీ విద్యుత్ శాఖలో ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

మీటర్ రీడర్ల ఆందోళన కారణంగా సంబంధిత అధికారులు చర్చలు జరిపి నాలుగు అంశాలను అమలు చేయడానికి హామీ ఇచ్చారని చెప్పారు. స్మార్ట్ మీటర్లు వస్తే మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని, ఎస్ క్రో అకౌంట్ ద్వారా ప్రతినెలా వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం ఎస్‌ఇకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి క్రాంతి, నాయకులు టి.గణేష్, ఎన్.ముత్యాలరావు, బి.సురేష్, బి.పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టాటా హిటాచీ ఎక్స్‌కవేటర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : టాటా హిటాచీ ఇఎక్స్ 350 ఎల్‌సి ప్రైమ్ ఎక్స్‌కవేటర్‌ను నగరంలోని ఒక హోటల్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టాటా హిటాచీ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) సిద్ధార్థ్ చతుర్వేది మాట్లాడుతూ, అధునాతన సాంకేతికత, మెరుగైన పని తీరుతో ఈ కొత్త మోడల్ నిర్మాణ యంత్రం పరిశ్రమలో కీలకంగా నిలవనుందన్నారు. శక్తివంతమైన ఇంజిన్, హెవీ డ్యూటీ అండర్‌కేరేజ్, 600 ఎంఎం జిపి, హెచ్డీ ట్రాక్ షూ ఎంపికలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇన్సైట్ 4జి టెలీమాటిక్ సూట్, యాప్, వెబ్ ఆధారిత మానిటరింగ్ సదుపాయం ఉందన్నారు. 7 అంగుళాల టిఎఫ్‌టి ఎల్‌సిడి మానిటర్, ఇంటిగ్రేటెడ్ రియర్ కెమెరా, ఇంజిన్ ప్రొటెక్షన్ కంట్రోల్ ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అధునాతన ఎక్స్‌కవేటర్ నిర్మాణ రంగంలో సమర్థతను పెంచుతూ మన్నికతో కూడిన అత్యుత్తమ పనితీరును అందించనుందని తెలిపారు. టాటా హిటాచీ పరిశ్రమ మారుతున్న అవసరాలు తీర్చేందుకు తాజా సాంకేతిక పరిజ్ఞానం, అధిక సామర్థ్యాన్ని కలిగిన ఈఎక్స్ 350ఎల్సీ ప్రైమ్ ఎక్స్‌కవేటర్‌ను రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో టాటా హిటాచీ సీనియర్ మేనేజ్‌మెంట్, రీకాన్ టెక్నాలజీస్ ప్రతినిధులు, కస్టమర్లు పాల్గొన్నారు.

ఎయు విసిని కలిసిన కిరణ్

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ఆంధ్ర యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ జిపి రాజశేఖర్‌ను స్టూడెంట్స్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్ కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్దార్ గౌతు లచ్చన్న జీవిత చరిత్ర పుస్తకాన్ని బహూకరించారు. ఆంధ్ర యూనివర్సిటీని అభివృద్ధి బాటలో నడిపించాలని విసిని కిరణ్‌కుమార్ కోరారు.

ఉపాధి అవినీతి ఆరోపణలపై దర్యాప్తు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం గ్రామంలో ఉపాధి పనిలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని గ్రామానికి చెందిన గొలజాన అప్పలరాజు, లంక అప్పారావు ఫిర్యాదుపై గురువారం ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి ఆధ్వర్యంలో అధికారుల బృందం విచారణ చేపట్టింది. ఉపాధి పథాల రాజమ్మ పనికి రాకున్నా కొందరి పేర్లు మస్టర్లలో నమోదుచేసి డబ్బులు స్వాహా చేస్తున్నారన్న ఆరోపణలపై రికార్డులు పరిశీలించగా, 18 పేరిట కొంత అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. ఇప్పటివరకు దాదాపు రూ.కోటి వరకు అక్రమాలకు పాల్పడి ఉంటారని ఫిర్యాదుదారులు ఆరోపించారు. కాగా దర్యాప్తు సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్ మేట్లను పురిగొలిపి, ఫిర్యాదుదారులపై భౌతిక దాడులకు ఉపక్రమించడంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఇసి తిరుమలరావు మాట్లాడుతూ, సంబంధిత రికార్డులను పరిశీలిస్తున్నామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. దర్యాప్తులో ఎంపిడిఒతోపాటు పీడీ అంజనేయులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలి



కెజిబివి సందర్శనలో కార్యదర్శి దేవానందరెడ్డి

ప్రజాశక్తి -భీమునిపట్నం : విద్యార్థినులు కనీస అభ్యసన సామర్థ్యాలు మెరుగు పరుచుకోవడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కస్తూర్బా విద్యాలయాల కార్యదర్శి దేవానందరెడ్డి అన్నారు. గురువారం గొల్లలపాలెం కెజిబివిని సందర్శించారు. పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు తెచ్చుకోవాలని టెన్త్ విద్యార్థినులకు సూచించారు టెన్త్ తర్వాత ఏమి చదవాలను కుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ఏడో తరగతి విద్యార్థినులకు ఫౌండేషన్ న్యూమరసీ టెస్టును నిర్వహించి, విద్యార్థినుల సామర్థ్యాలను పరిశీలించారు. ఎనిమిదో తరగతి గణితం, తెలుగు తరగతులను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి దేవానందరెడ్డి, సమగ్రశిక్ష ఎపిసి జె.చంద్రశేఖరరావు మధ్యాహ్న భోజనం చేశారు. పరిసరాలు పరిశీలించారు. ప్రిన్సిపాల్ గంగాకుమారి పాల్గొన్నారు

బోధన కంటే నేర్పించడంపై శ్రద్ధ చూపండి

బోధించడం కంటే నేర్పించడంపై శ్రద్ధ చూపాలని ఛాత్రోపాధ్యాయులకు కెజిబివి సెక్రటరీ దేవానందరెడ్డి సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ డైట్‌ను సందర్శించారు. ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నందుకు చాత్రోపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఎల్ సుధాకర్, అధ్యాపకులు జిఐవిఎస్ నాగేశ్వరరావు, సోమయాజులు, త్రినాథరావు, మహాలక్ష్మి, మాధవి, హరిణి, నీలిమ పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి



మృతి చెందిన దిలీప్

ప్రజాశక్తి -గాజువాక. : విద్యుత్ సర్వీసు వైర్లు తగిలి బాలుడు మృతి చెందిన ఘటన ఆర్కే హాస్పిటల్ వెనక నాయుడుగారి వీధిలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నాయుడుగారి వీధి వద్ద సిరసపల్లి శైలజ ఇంట్లో శుభకార్యానికి గోపిశెట్టి దిలీప్ (16) వచ్చాడు. మేడ మీద స్నేహితులతో ఆడుకుంటుండగా, విద్యుత్ సర్వీస్ వైరు తగలడంపై షాక్‌కు గురై కింద పడిపోయారు. కుటుంబసభ్యులు వెంటనే అప్రమత్తమై ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే దిలీప్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దిలీప్ మృతదేహాన్ని శ్రీనగర్ అఫీషియల్ కాలనీలోని వారి స్వగృహానికి తీసుకెళ్లారు. దీనిపై పోలీసులకు ఇంకా ఫిర్యాదు అందలేదు.

10 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -కొత్తకోట: ఏజెన్సీ ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న పది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక విలేకరులకు అందించిన వివరాల మేరకు....అల్లూరి జిల్లా ఏజెన్సీ నుంచి కొత్తకోట మీదుగా గంజాయి తరలిస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో దొండపూడి చెక్ పోస్ట్ వద్ద సిబ్బందితో వాహనతనిఖీలు చేపట్టామన్నారు. ఆటోలోని ఇద్దరు వ్యక్తుల బ్యాగులు తనిఖీ చేయగా, సుమారు రూ 30 వేలు విలువైన గంజాయి వుందన్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా పెదబయలు మండలం జామిగూడ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపాడు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 42వ వార్డు రైల్వే న్యూకాలనీ మసీదు వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలకు కార్పొరేటర్ ఆర్. లీలావతి జీవీఎంసీ అధికారులతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు రూ.20 లక్షల జివిఎంసి నిధులతో బాక్స్ కల్వర్టు, ఫుట్‌పాత్ టైల్స్ నిర్మించనున్నారు. కార్యక్రమంలో జివిఎంసి ఐదో జోన్ కమిషనర్ బి రాము, డిఇఇ సుబ్బారావు, ఎఇఇ రమణమ్మ, కూటమి నేతలు శ్యామల దీపిక, అక్కిరెడ్డి జగదీష్, రమణారావు, గురు గోవింద్‌సింగ్, పాల్గొన్నారు.

దువ్వాడ- నౌపడ- పర్లాకిమిడి సెక్షన్ల పరిశీలన

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా దువ్వాడ-నౌపాడ-పర్లాకిమిడి సెక్షన్‌లోని ప్రధాన రైల్వే సౌకర్యాలను సీనియర్ అధికారులతో కలిసి పరిశీలించారు. దువ్వాడ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు, సౌకర్యాలు, ట్రాఫిక్ సౌకర్యాల పురోగతిపై డిఆర్ఎం సమీక్షించారు. దువ్వాడ నుంచి నౌపడా వరకు కీలకమైన ప్రాంతాలు, యార్డులను పరిశీలించి కార్యాచరణ పెంపుదల, అభివృద్ధికి పలు సూచనలు చేశారు. అనంతరం పర్లాకిమిడి నౌపడా రైల్వే స్టేషన్లలో అమృత్ భారత్ స్టేషన్ పనుల పురోగతిని పరిశీలించారు.

ముడసర్లోవ పార్కులో అగ్ని ప్రమాదం

భారీగా ఎగసిపడిన పొగ, మంటలు



పార్కులో ఎగసి పడుతున్న దట్టమైన పొగ, మంటలు

ప్రజాశక్తి - ఆరిలోవ :ఎన్నో ఏళ్ళ చరిత్ర కలిగిన ముడసర్లోవ పార్కులో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. దట్టమైన పొగ, మంటలు చెలరేగడంతో ఒక్కసారి చుట్టుపక్కల ఉన్న కాలనీ వాసులు, సందర్శకులు, సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. అక్కడే ఉన్న పార్కు సిబ్బంది అప్రమత్తమై నీటి ట్యాంకులు అందుబాటులో ఉండడంతో చాలా వరకు మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. తరువాత అగ్నిమాపక సిబ్బంది చేరుకుని పూర్తిగా మంటలను అదుపులోకి తేవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పార్కు సిబ్బంది, జివిఎంసి నీటి విభాగం ఎఇ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి. పార్కులో గెస్ట్ హౌస్ పక్కనే ఉన్న దట్టమైన వెదురు బుంగల పొద, ఎండిన ఆకులు ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో ఎవరో గుర్తు తెలియని ఆకతాయిలు కాల్చి పడేసిన సిగరెట్టు ముక్కలు అప్పటికే ఎండిన ఆకులకు రాజుకుని, మంటలు చెలరేగడంతో అక్కడే ఖాళీగా ఉన్న పాడైన వాటర్ ట్యాంకులకు వ్యాపించడంతో దట్టమైన పొగ, మంటలు ఉవ్వెత్తున ఎగసి పడ్డాయి. ఎవ్వరికి ఎటువంటి ప్రమాదం జరగకుండామంటలను అదుపులోకి తేవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల కైలాసగిరి కొండపైనా, ఇపుడు ముడసర్లోవ పార్కులో అగ్ని ప్రమాదం జరగడంతో సందర్శకులు ఆందోళన చెందుతున్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మూల్యాంకన నుంచి

మినహాయింపు నివ్వండి



డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - ఆరిలోవ : వచ్చేనెల 3 నుంచి నిర్వహించే పదోతరగతి స్పాట్ వేల్యూషన్‌కు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, శారీరక, మానసిక వైకల్యం, 58 ఏళ్ళ నిండిన వారు, ఎంఆర్ పిల్లలు ఉన్నవారికి లాక్టేటెడ్ మదర్స్‌కు మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ కోరింది. గురువారం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌ను యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్, జిల్లా కోశాధికారి కె.రాంబాబు, కార్యదర్శి టి.జగన్ కలిసి వినతి పత్రం అందజేశారు.

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాపై

అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి - ఆరిలోవ :పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచినట్లు డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. మొదటి జాబితాలో అభ్యంతరాలను పరిష్కరించి జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లోను, కార్యాలయం నోటీసు బోర్డులో ఉంచినట్లు తెలిపారు. వీటిపైనా ఎటువంటి అభ్యంతరాలు ఉంటే ఈ నెల 24న సాయంత్రం 5 గంటలలోగా డిఇఒ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

అగ్నిమాపక శకట మరమ్మతులకు

దివీస్ ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న దివీస్ జిఎం కోటేశ్వర రావు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టి వలస అగ్నిమాపక శకటం మరమ్మతులకు భీమిలి మండలం, చిప్పాడ దివీస్ సంస్థ రూ 65 వేలు సాయం అందజేసింది. గురువారం సంస్థ కార్యాలయంలో అగ్నిమాపకశాఖ అధికారి జి శ్రీనివాస రాజుకు ,దివీస్ జనరల్ మేనేజర్ వై ఎస్ కోటేశ్వరరావు చెక్కు అందజేశారు. వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తగా అగ్ని మాపక శకటం మరమ్మతులకు ఆర్థిక సాయం అందించినట్లు సంస్థ జి ఎం కోటేశ్వర రావు తెలిపారు దివీస్ యాజమాన్యానికి శ్రీనివాసరాజు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దివీస్ భద్రతా అధికారి ఎం చంద్రశేఖర్, సిఎస్ఆర్ ప్రతినిధి ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు

ఘనంగా నూకాంబిక పండుగ

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 53వ వార్డు శ్రీరామ్‌నగర్ కాలనీలో నూకాంబిక అమ్మవారి పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌కు ఆలయ కమిటీ సభ్యులు సాదరంగా స్వాగతించారు. అమ్మవారి దర్శనానంతరం తీర్థప్రసాదాలు అందజేసి దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా భక్తులకు కమిటీ సభ్యులు నిర్వహించిన అన్నసమారాధనలో డిప్యూటీ మేయర్ శ్రీధర్ పాల్గొని, అన్నప్రసాదాన్ని వడ్డించారు.కార్యక్రమంలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు

గుడి, బడులను ఆక్రమిస్తే ఊరుకోం

ఆక్రమణలను అడ్డుకుని, ఆందోళన చేసిన శొంఠ్యాం వాసులు



ఆక్రమణలను అడ్డుకుని ఆందోళన చేసిన శొంఠ్యాంవాసులు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని శొంఠ్యాం గ్రామంలో గుడి, బడి స్థలాలను వైసిపి నేత బొద్దపు శ్రీను ఆక్రమించుకుంటున్నారని ఆరోపిస్తూ బుధవారం గ్రామస్తులు ఆందోళన చేశారు. ఆక్రమణ చర్యలను అడ్డుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, శొంఠ్యాంలో పూర్వకాలం నుంచి ఉన్న ప్రభుత్వ పాఠశాల, దాని ప్రాంగణంలో ముందున్న స్థలంలో సాయిబాబా దేవాలయం, పాఠశాల తాగునీటి బోరు, పాఠశాల మైదానం, రెయిన్‌గేజ్, పాలకేంద్రం, బిసి కాలనీకి, గొంతినవానిపాలెం, ప్రసాదువానిపాలెం గ్రామాలకు వెళ్లే రోడ్డు ఉన్నాయి. అయితే సుమారు రూ.మూడు కోట్ల విలువైన ఈ స్థలంపై కన్నేసిన వైసిపి నేత బొద్దపు శ్రీనివాస్, ఐదుగురు బినామీలతో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇపుడు తన జిరాయితీ భూమి అంటూ కాజేయాలని చూస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గుడి,బడితోపాటు మంచినీటి బోరు రెయిన్‌గేజ్,విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న స్థలాన్ని 2017లో బినామీల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకుని కాజేయాలని చూడడం మాజీ సర్పంచ్ తనయుడైన బొద్దపు శ్రీనుకు తగదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అంటున్నారు. అధికారులు స్పందించి సామాజిక ఆస్తులకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. ఆందోళనలో కోరుకొండ మూర్తి, బొద్దపు గోవింద, బూస కోటేశ్వరరావు, సియాద్రి సత్యనారాయణ, లంక రాంబాబు, లోకిరెడ్డి అచ్చిబాబు, కోరుకొండ వెంకట్రావు, ప్రసాదు, కోరుకొండ నారాయణమ్మ, బల్లంకి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల హామీ అమలులో వైఫల్యం

ప్రజాశక్తి -గాజువాక : అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు కేటాయింపులో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని సిపిఐ రాష్ట్ర సహాయకార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి ఆరోపించారు. గురువారం సిపిఐ ఆధ్వర్యంలో పేదల నుంచి సేకరించిన వ్యక్తిగత ఇంటి స్థలాల దరఖాస్తులను పెదగంట్యాడ తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారని, 9 నెలలు గడిచినా ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల ఇంటిస్థలాలను ఇచ్చి, ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థికసాయం అందించాలని కోరారు. సిపిఐ ఆధ్వర్యంలో సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి, నెలరోజుల్లో తగు చర్యలు చేపట్టకుంటే ఆందోళ ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, వి. చంద్రశేఖర్, ఎ.విమల, నాయకులు కె. అచ్యుతరావు, కె.వనజాక్షి, పల్లేటి పోలయ్య , కె.పోతయ్య, సోమేష్, మాధవ రావు, మధుసూదనరావు, ఇళ్ల స్థలాల దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ కమిషన్‌ను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వం వేసి ఎస్‌సి వర్గీకరణ కమిషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని మాల మహానాడు జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మంచాల నాగమల్లేశ్వరి డిమాండ్ చేశారు. గురువారం పౌరగ్రంథాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణతో అన్నదమ్ముల్లా ఉన్న దళితులను విడదీయాలని కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎస్‌సి వర్గీకరణపై కోర్టులో పిటిషన్ దాఖలు చేశామన్నారు. మంద కృష్ణ మాదిగ మెప్పు కోసం హడావిడిగా కమిషన్ వేసి, రాజకీయ లబ్ధి కోసం దళితులను వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు రాష్ట్రంలో సమగ్ర కులగణన సర్వే చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్‌గా ఎస్‌సి వర్గీకరణ అంశాన్ని ముందుకు తెస్తున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ జరగనివ్వ బోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు త్రినాధ్, వెంకటరమణ, ధర్మావతి పాల్గొన్నారు

సూక్ష్మ పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి- పద్మనాభం :ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఐటీసీ ఆశీర్వాద్ స్వార్ట్ ఇండియా ప్రోగ్రాం పోషణమేళా కార్యక్రమాన్ని గురువారం బిఆర్ తాళ్లవలస జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు సూక్ష్మ పౌష్టికాహారంపై అవగాహనకు ఐదు రకాల స్టాళ్లను ఏర్పాటుచేసి, వివిధ ఆహారపు అలవాట్లుపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వివిధ రకాల కార్యక్రమాలు, గేమ్స్ నిర్వహించారు. ఐజిడి ప్రతినిధులు సి.సాయికృష్ణ ఒడబ్ల్యుఎస్ స్కూల్ టీచర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.



స్టాళ్లను పరిశీలిస్తున్న విద్యార్థులు

సైబర్ నేరాలపై అప్రమత్తత

ప్రజాశక్తి- సీతమ్మధార : సైబర్ మోసాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఫోర్త్ టౌన్ సిఐ సత్యనారాయణ సూచించారు గురువారం దొండపర్తిలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ అనధికార బీటిలు వేసి మోసపోవద్దని హితవు పలికారు. ఆన్‌లైన్ రుణ యాప్‌లపై న్ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బాలికల మిస్సింగ్ కేసులు నమోదపై ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలు, అల్లర్లు పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ గస్తీ ముమ్మరం చేశామన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఫోర్త్ టౌన్ పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.

23న ఎపి బాడీ లిఫ్టింగ్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలోని రామాటాకీస్ దరి వాయుపుత్ర హెల్త్ క్లబ్‌లో ఈనెల 23న ఆదివారం ఉదయం 10 గంటలకు ఆంధ్ర బాడీ లిఫ్టింగ్ జట్లను ఎంపిక చేయనున్నట్లు ఆంధ్ర బాడీ లిఫ్టింగ్ సంఘం ప్రెసిడెంట్ ఎస్.ఎస్.శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు వెయిట్ వయస్సు విభాగాల్లో వేర్వేరుగా ఎంపికలు జరుగుతాయ మాస్టర్స్ విభాగంలో 45, 50, 55, 60 ఏళ్ల దాటిన కేటగిరిలోనూ వికలాంగులకు 65 కిలోల లోపల, 65 కిలోల పైన రెండు విభాగాల్లో ఎంపికలు ఉంటాయన్నారు ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 26 ,27 తేదీల్లో పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో జరిగే 15వ జాతీయ బాడీ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి గలవారు ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో వాయుపుత్ర హెల్త్ క్లబ్‌కు హాజరు కావాలన్నారు మరిన్ని వివరాలకు 8885203519 మొబైల్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ఘనంగా అజయ్‌కుమార్ పుట్టినరోజు వేడుక



కేకు కట్ చేస్తున్న అజయ్‌కుమార్

ప్రజాశక్తి -మధురవాడ : టిడ్కో కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ పుట్టిన రోజు వేడుకలను జనసేన భీమిలి ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల ఆధ్వర్యంలో ఎండాడలోని పార్టీ కార్యాలయంలో శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహించారు. పార్టీ శ్రేణుల కోలాహలం మధ్య కేకు కట్ చేశారు.వార్డు, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా పి4 సర్వే పూర్తి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపిడిఒ హనుమంతరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 సర్వేను ఎంపిడిఒ ఎన్.హనుమంతరావు గురువారం మండలంలోని మూలకుద్దు గ్రామంలో పర్యటించి, పరిశీలించారు.. క్షేత్రస్థాయిలో సర్వే జరుగుతున్న తీరును పర్యవేక్షించి, పంచాయితీ కార్యదర్శి పి రామారావు, వెల్ఫేర్ కార్యదర్శి నవీనకు పలు సూచనలు చేశారు. పంచాయతీ సర్పంచ్ కె రామకృష్ణ పాల్గొన్నారు. నిర్ణీత గడువులోగా సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు

జిల్లా నోడల్ అధికారిగా భాగ్యలక్ష్మి



నియామకపత్రం అందుకుంటున్న భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి -ములగాడ : విశాఖ జిల్లా నోడల్ అధికారిగా ఐఇఎస్. భాగ్యలక్ష్మిని నియమిస్తూ ఎయు ఉప కులపతి ఆచార్య జిపి. రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకు ముందు ఎయిడ్స్ ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్‌గా, రెడ్ రిబ్బన్ క్లబ్స్ జిల్లా కోఆర్డినేటర్‌గా, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారిగా జిల్లా స్థాయిలో పలు పదవులను నిర్వర్తించిన భాగ్యలక్ష్మి జిల్లా నోడల్ అధికారిగా పలు సేవా కార్యక్రమాలలో యువతను, ఉన్నత విద్యాసంస్థలను భాగస్వామ్యం చేయనున్నారు. భాగ్యలక్ష్మిని ఎయు ఎన్‌సిసి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. హరినాథ్, ఇతర జిల్లాల నోడల్ అధికారులు, సెయింట్ ఆన్స్ కళాశాల యాజమాన్యం, తదితరులు అభినందించారు

ల్యాండ్ పూలింగ్ బాధితులకు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి మండలం కుంచంగి, కూండ్రం, రొంగలివానిపాలెం గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు కోల్పోయిన బాధితులకు తక్షణమే ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల్లో ప్లాట్లను గురువారం లోకనాథంతో పాటు సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు తదితరులు పరిశీలించారు. ఈ భూముల్లో ఉన్న జీడి తోటల వల్ల సంవత్సరానికి రూ.60 వేలు నుండి రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చేదని, ఆ జీడి తోటలను కూలగొట్టడం ద్వారా తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు సిపిఎం నేతల వద్ద తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ సిఐడి దర్యాప్తు పేరుతో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా తాత్సారం చేయడం దారుణమన్నారు. వాస్తవానికి లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించినప్పటికి రిజిస్ట్రేషన్ చేయకుండా రెండు సంవత్సరాల నుంచి రెవెన్యూ కార్యాలయాలు చుట్టు తిప్పుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా వెంటనే దర్యాప్తు పూర్తి చేసి దోషులపై చర్యలు తీసుకొని నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జీడి తోటల ద్వారా వచ్చే ఆదాయాన్ని కోల్పోయిన రైతులకు రిజిస్ట్రేషన్ చేయకుండా కూడా హింసించడం దుర్మార్గమన్నారు. మామిడిపాలెం, కోడూరు, కొండెపాలెం, సంతపాలెం గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ కాలంలో ఇద్దరు మండల స్థాయి ప్రజాప్రతినిధులు అక్రమాలకు పాల్పడ్డారని చేతనైతే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రిజిస్ట్రేషన్ చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో త్రిమూర్తులు, పి.మురళి, పి.శాంతికుమారి, బి.జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.



ల్యాండ్ పూలింగ్ భూములను పరిశీలిస్తున్న లోకనాథం తదితరులు



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేసిన దృశ్యం

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ప్రజలకు ఆరోగ్యం ఇవ్వడంతో పాటు పండించిన రైతులకు ఆదాయం వస్తుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్టు అధికారి సిహెచ్ లచ్చన్న అన్నారు. స్థానిక జీవీఎంసీ కార్యాలయంలో గురువారం ఏపీ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ స్టాల్ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేచురల్ ఫార్మింగ్లో పండించిన వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయలు, ఆకుకూరలు ప్రజలకు ఎంతో ఆరోగ్యం ఇస్తాయన్నారు. ఇప్పటికే ప్రతి సోమవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద, ప్రతి గురువారం జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద స్టాల్ ద్వారా విక్రయాలు సాగిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వల్ల బీపీ, షుగరు, గుండెపోటు వంటి వ్యాధులు రాకుండా ఉంటాయని చెప్పారు. మునిసిపల్ సిబ్బంది, స్థానికులు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి వర్మ, జిల్లా కోఆర్డినేటర్ గోవింద్, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ అప్పలరాజు, మోడల్ మేకర్స్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న దృశ్యం

రెల్లిలకు 5శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఎస్సి వర్గీకరణలో భాగంగా రెల్లి కులం వారికి 5 శాతం రిజర్వేషన్ కేటాయించాలని కోరుతూ కె.కోటపాడు రెల్లి వీధిలో అంబేద్కర్ విగ్రహం వద్ద రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోరాట సమితి మండల అధ్యక్షులు వడ్డాది కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. వర్గీకరణ కమిషన్, మంత్రులు కమిటీ, మరోసారి పునరాలోచన చేసి రెల్లిలకు ఐదు శాతం రిజర్వేషన్ కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతి కోటేశ్వరరావు, భూపతి త్రినాథ్, భూపతి అప్పలరాజు, వడ్డాది శ్రీను, వడ్డాది నరసింహమూర్తి, భూపతి గణేష్, భూపతి మోహన్ రావు, కోటయ్య పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని మల్లునాయుడుపాలెం ఎస్సి కాలనీలో రెల్లి కులస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెల్లి హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు భూపతి అప్పారావు మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నేతలు వి.సింహగిరి, వి.ఆంజనేయులు, వి.నూకరాజు, బొర్రా నూకరాజు, ఎస్.త్రినాథరావు, వి.లక్ష్మణరావు, బి.రాంబాబు, సింగంపల్లి కృష్ణ పాల్గొన్నారు.

విలువిద్య పోటీలకు క్రీడాకారుల ప్రకటన

ప్రజాశక్తి-పరవాడ : గుంటూరు జిల్లాలో ఈ నెల 20 నుండి 29 వరకు జరుగు జాతీయ స్థాయి ఎన్టిపిసి చెరుకూరి లెనిన్ ఓల్గా మెమోరియల్ 14వ మినీ, 6వ కిడ్స్, ఓపెన్, 1వ కిడ్స్, ఓపెన్ ఇండియన్ రౌండ్, రికర్వ్, కాంపౌండ్ నేషనల్ ఆర్చరీ చాంపియన్ షిప్కు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించే విశాఖపట్నం ఆర్చర్ల వివరాలను ఉమ్మడి విశాఖపట్నం అసోసియేషన్ సెక్రటరీ కె. నిశాంత్ గురువారం వెల్లడించారు. అండర్ 15 ఇండియన్ రౌండ్ బాయ్స్ అండ్ గర్ల్స్లో సోదే రామ్, చైతన్య సాయి, మనస్వి కనకళ, అండర్ 13 ఇండియన్ రౌండ్ బాయ్స్ అండ్ గర్ల్స్లో వంతల లలిత్, సాయి తేజ, నల్లి తేజేశ్వరరావు, కిల్లో చోద్య నందిత, అండర్ 13 కాంపౌండ్ గర్ల్స్లో ఊడి యశస్వి, ఆద్య వేమూరి, అండర్ 13 రికర్వ్ గర్ల్స్లో శనివాడ తన్మయశ్రీ, అండర్ 10 ఇండియన్ రౌండ్ బాయ్స్లో సిరువురి వెంకట శరత్ వర్మ, అండర్ 10 రికర్వ్ బాయ్స్ అండ్ గర్ల్స్లో లెక్కల శార్విక్ సుదీవ్, శనివాడ కన్విక శ్రీల పాల్గొంటున్నారు. వీరంతా జాతీయ స్థాయిలో కూడా రాణించాలని క్రీడా అధ్యక్షులు పి. సూర్య నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, కోశాధికారి పి.భాస్కర్, కోచ్లు శివకుమార్, గోవిందలు ఆకాంక్షించారు.

50 ఎకరాల్లో జీడి తోటలు దగ్ధం

కోటి రూపాయల వరకు నష్టం



దగ్ధమైన జీడి తోటలు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం ఎల్బీపీ అగ్రహారం, బంగారుమెట్ట గ్రామాల్లో జీడి మామిడి తోటలు గురువారం దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన అనిమిరెడ్డి దొంగబాబు, సత్తిబాబు, రాము, కొరవా వరహాలుతో పాటు మరికొందరి రైతులకు చెందిన జీడి మామిడి తోటల్లో గురువారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. ఇది గమనించిన పరిసర రైతులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయింది. వెంటనే రావికమతం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చే లోపే జీడిమామిడి తోటలన్నీ పూర్తిగా కాలిపోయాయి. సుమారు 50 ఎకరాల్లోని జీడి తోటలు కాలి బూడిద కావడంతో బాధిత చైతులు కన్నీరు మున్నీరుగా విలపించారు. జీడి మామిడి తోటలు పింజె దశలో ఉన్నాయి. ఈ ఏడాది పూత బాగా ఉండటంతో అధిక మొత్తంలో పంట చేతికి వస్తుందని రైతులు ఆశించగా, ఇంతలోనే అగ్నికి ఆహుతయ్యాయి. రూ.50 లక్షల నుండి కోటి రూపాయల వరకు నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలియజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ

ప్రజాశక్తి-అనకాపల్లి

ఓటరు జాబితాలో సమస్యలు, అభ్యంతరాలు ఉంటే బూత్ లెవెల్ అధికారికిగాని, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి గాని, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు జిల్లా రెవిన్యూ అధికారి వై సూర్యనారాయణ రావు సూచించారు. జిల్లా రెవిన్యూ అధికారి ఛాంబర్లో గురువారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఓటరు జాబితాల సవరణలో భాగంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలు ప్రకారం ఓటర్ల జాబితా తయారీ చేయుట కోసం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటరు జాబితాలో అసెంబ్లీ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు, అభ్యంతరాలు, ఓటరు జాబితాలో అనర్హులు ఉంటే బిఎల్ఓలకు గాని, ఎఈ ఆర్ఓలకు లేదా ఈఆర్ఓ ల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు నిరంతర ప్రక్రియ అయినందున రాజకీయ పార్టీల ప్రతినిధులు జాబితాను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేసేందుకు, పరస్పర అనుకూలమైన సలహాలు, సూచనలు అందించేందుకు రాజకీయ పార్టీలకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎస్ఎస్వి.నాయుడు, టిడిపి నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు కెఎం నాయుడు, వివి సంతోష్ కుమార్, సిపిఎం నాయకులు గంటా శ్రీరామ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మీసాల సుబ్బన్న, మలపురెడ్డి కోటేశ్వరరావు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొణతాల హరినాథ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలు సందర్భంగా గురువారం స్థానిక కస్పావీధి ప్రాథమిక పాఠశాలలో పొట్టి శ్రీరాములు భవన వ్యవస్థాపక అధ్యక్షులు పిరాట్ల నరసింహమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. దీనికి జనసేన నాయకురాలు స్వాతి ఆర్థిక సాయం అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించిన త్యాగశీలి అమరజీవి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.



డిఆర్ఒకు వినతిపత్రం ఇస్తున్న నాగభూషణం తదితరులు

లేజర్ స్క్రీన్, ఫుడ్ కోర్టులను అందుబాటులోకి తేవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : బొజ్జన్నకొండ వద్ద నూతనంగా నిర్మించిన లేజర్ స్క్రీన్, ఫుడ్ కోర్టులను తక్షణమే బొజ్జన్నకొండ పర్యాటక సందర్శకులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని కోరుతూ సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం డిఆర్ఓ వై.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ బొజ్జన్నకొండ చరిత్రను, విశిష్టతలను, ప్రాముఖ్యతలను తెలిపే చిత్రప్రదర్శనకు బొజ్జన్నకొండ వద్ద ప్రభుత్వ నిధులతో అత్యంత ప్రతిష్టాత్మకంగా లేజర్ స్క్రీన్ థియేటర్ను, పర్యాటకుల అవసర నిమిత్తం ఫుడ్ కోర్టులను ముఖ్యమంత్రి ప్రారంభించారని తెలిపారు. ఇంతవరకు వాటిని పర్యాటకులకు అందుబాటులోకి తేకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్గుప్తా, రొబ్బి మల్లేశ్వరరావు, బొడ్డు సోమరాజు, బండి అప్పారావు, పి.దయాల్ రాజ్ పాల్గొన్నారు.

ఇన్ఛార్జి ఇఒపిఆర్డిగా అప్పారావు

ప్రజాశక్తి-అనకాపల్లి దెస్క్ : మండల ఇన్ఛార్జి ఈవోపీఆర్డీగా జామి అప్పారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 27 పంచాయతీల్లో ఇంటి పన్ను సకాలంలో చెల్లించాలన్నారు. మండలంలో రూ.92.25 లక్షలు ఇంటి పన్ను లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.53 లక్షలు వసూలు చేసినట్లు చెప్పారు. ఈనెల 31వ తేదీ లోగా ఇంటి పన్నులు చెల్లించాలని, లేకుంటే నోటీసులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. తాగునీటి సమస్యలపై 7660922382 నెంబర్లో సంప్రదించాలని కోరారు.



బాధ్యతలు స్వీకరించిన అప్పారావు



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ గంగ అప్పలనాయుడు

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని మూలపేట గ్రామంలో పంచాయితీ నిధులు రూ.2 లక్షల వ్యయంతో మెయిన్ రోడ్డు బర్రెల షెడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ భీశెట్టి గంగ అప్పల నాయుడు గురువారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కాండ్రేగుల వెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ మొల్లేటి దేవి చంద్ర, తోటాడ, మూలపేట కార్యదర్శులు మొల్లేటి గంగాధర్, లక్ష్మీ వార్డ్ మెంబర్లు ఆడారి సత్యనారాయణ, ఆడారి అమ్మాజీ, సన్యాసినాయుడు, మొల్లేటి గోవిందరావు, కాండ్రేగుల వరలక్ష్మి, శ్రీనివాసరావు, కాండ్రేగుల నాని, ఎల్లపు హైమావతి నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 30లోగా టిడిపి కమిటీల ఏర్పాటు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏప్రిల్ 15 నుంచి 30వ తేదీ లోగా గ్రామస్థాయి నుంచి పార్లమెంటు స్థాయి టిడిపి ప్రధాన, అనుబంధ కమిటీలు పూర్తి చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇన్చార్జులు ప్రతి బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నియోజకవర్గ ప్రజల నుంచి గ్రీవెన్స్ తప్పనిసరిగా స్వీకరించాలని సూచించారు. ప్రతి బుధవారం మధ్యాహ్నం నుంచి పార్టీ క్యాడర్‌తో నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించాలన్నారు. ప్రతి నెల ఇన్చార్జ్ మంత్రులు తమకు కేటాయించిన జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటించాలన్నారు.

ఘనంగా శోభన్ బాబు వర్ధంతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రుల అందాల నటుడు శోభన్ బాబు 17 వర్ధంతి వేడుకలు అనకాపల్లి విజయరామరాజుపేటలో గురువారం శోభన్ బాబు అభిమాన సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ముగడ అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా శోభన్‌బాబు చిత్రపటానికి స్థానిక పెద్దలు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలకా రాము, పలకా సత్యనారాయణ, పిట్ల బుడ్డేశ్వరరావు, బొబ్బిలి అప్పారావు, బొబ్బిలి గోవింద్, ఒమ్మి రాము, పళ్ళ సత్య అప్పారావు, అప్పికొండ ప్రసాద్, పి ఇల్లపు రెడ్డి, విత్తనాల పోతురాజు, లాయర్ ప్రసాద్ పాల్గొన్నారు.

నోటి పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-సబ్బవరం : ప్రపంచ ఓరల్ హెల్త్ దినోత్సవం సందర్భంగా స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో గురువారం పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో నోటి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ హాస్పటల్ డెంటల్ సర్జన్ డాక్టర్ విద్యాధరి ముఖ్య అతిథిగా పాల్గొని నోటి పరిశుభ్రత గురించి, పోషకాహార విలువల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్, డాక్టర్ కన్నం నాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రపంచ నోటి పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ఎ.మనీషా నోటి క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. నోటి పరిశుభ్రత గురించి విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకులు ఏంఎస్‌వి ప్రసాద్, ప్రిన్సిపాల్ జి.గ్రేస్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

నేడు గోవాడ సుగర్స్ వద్ద మహాధర్నాకు తరలిరావాలి

గ్రామాల్లో రైతు సంఘాల నేతలు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-చోడవరం

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికులకు బకాయిల చెల్లించాలని, ఫ్యాక్టరీ ఆధునికీకరణకు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21న గోవాడ ఫ్యాక్టరీ వద్ద ఉదయం 10 గంటలకు జరుగు మహాధర్నాకు రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సీఐటీయూ జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ధర్నాకు తరలిరావాలని కోరుతూ గురువారం గ్రామాల్లో ఆటో ప్రచారం నిర్వహించారు. చోడవరంలో ప్రారంభమైన ఆటో ప్రచారం గోవాడ, అంబేరుపురం, భోగాపురం, చోడవరం, అంకుపాలెం, శ్రీరామ్‌పట్నం, పిఎస్.పేట, జుతాడ తదితర గ్రామాల్లో సాగింది. ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి మహాధర్నాకు రావాల్సిన ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఏరోజు ఆగితుందో, ఎప్పుడు తిరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితిలో ఉందన్నారు. తరచూ క్రషింగ్‌కు ఆటంకం కలుగుతుండడంతో రైతుల వద్ద చెరుకు ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ప్రభుత్వం దీనిపై కనీసం దృష్టి పెట్టకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే ఫ్యాక్టరీ రిపేర్లకు రూ.35 కోట్లు, ఆధునీకీకరణకు తగిన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు సదా శివరావు, నాగిరెడ్డి సత్యనారాయణ, లక్ష్మణ్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎస్‌వి.నాయుడు

వడ్డాది : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సమస్యలపై ఈ నెల 21న జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ బుచ్చయ్యపేట మండలం వడ్డాది, బంగారుమెట్ట, విజయరామరాజుపేట గ్రామాల్లో రైతు నాయకులు గురువారం కరపత్ర ప్రచారం నిర్వహించారు. రైతు సంఘం నాయకులు ఎస్‌వి.నాయుడు, పినపాత్రని సాంబశివరావు వడ్డాది చెరుకు కాటా వద్ద రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో రైతు నాయకులు అప్పలనాయుడు, వి సత్యం పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న నాయనబాబు

కె.కోటపాడు : గోవాడ సహకార చక్కెర కర్మాగారం వద్ద శుక్రవారం జరుగు మహాధర్నాలో రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు పిలుపునిచ్చారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని పైడంపేట, రొంగలినాయుడుపాలెం, మేడిచర్ల, గొండుపాలెం, చౌడువాడ, మల్లంపాలెం గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో రైతు నాయకులు ఎర్ర దేముడు, వనము సూర్యనారాయణ, రాపేటి రామానాయుడు, రైతులు పాల్గొన్నారు.

పిల్లలకు ఆరోగ్యకరమైన విద్యను అందించాలి



ఆనందపురంలో శిక్షణలో పాల్గొన్న అంగన్వాడీలు

ప్రజాశక్తి -ఆనందపురం

పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారం, విద్యను అందించాలని సిడిపిఒ శ్రీలక్ష్మి సూచించారు. గురువారం కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక. మండలపరిషత్ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణలో బాలల విద్య ప్రాముఖ్యత, పిల్లల ఆకాంక్షలను అర్ధం చేసుకోవడానికి సాముహిక కార్యక్రమాలు, పిల్లల సమగ్ర అభివృద్ధి, పోషకాహార లోపాలను గుర్తించటం, ఆరేళ్లలోపు పిల్లలకు సూక్ష్మ పోషకాహార లోపాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం, పిల్లల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చేలా నైపుణ్యాలపై అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. అంగన్వాడీ సూపర్వైజర్లు రత్నం, రేఖ, వాణి పాల్గొన్నారు

భీమునిపట్నం : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అర్బన్, కె నగరపాలెం సెక్టార్ల పరిధిలోని 45మంది అంగన్వాడీ వర్కర్లకు మూడు రోజుల శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఆరేళ్ల లోపు పిల్లల్లో పోషణ, ఆటపాటలు నేర్పే విధానంపై సూపర్‌వైజర్లు కె ప్రమీల, బి.అనిత శిక్షణ ఇచ్చారు.' పోషణ్ బి, పడాయి బి' పేరుతో అంగన్వాడీ వర్కర్ల సామర్థ్యం పెంపుదలపై తర్ఫీదు ఇచ్చారు. సిడిపిఒ శ్రీదేవి పాల్గొన్నారు.

పద్మనాభం : . అంగన్వాడీ వర్కర్లకు పనిసామర్థ్యం పెంపుపై స్థానిక వెలుగు కార్యాలయంలో మూడురోజుల శిక్షణ గురువారం ప్రారంభమైంది. మండలంలోని అంగన్వాడి వర్కర్లకు భీమిలి సిడిపిఒ శ్రీదేవి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, ఉమ, జానకి శిక్షణనిచ్చారు.

నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీలకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. పోషణతో కూడిన నాణ్యమైన విద్యను చిన్నారులకు అందించడం, నవచేతన ద్వారా మూడు సంవత్సరాల లోపు పిల్లలకు అందించాల్సిన పోషకాహారం, పిల్లల సంపూర్ణ ఆరోగ్యం, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలపై అంగన్వాడీలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ శ్రీవిద్య, పాఠశాల హెచ్ఎం కవిత, సూపర్వైజర్లు నిషా, సత్యవతి, సౌజన్య పాల్గొన్నారు.

యలమంచిలి : అంగన్వాడీలు పోషణాహార కేంద్రాలుగానే కాకుండా విద్యను కూడా అందించే కేంద్రాలుగా తీర్చి దిద్దే కార్యక్రమంలో భాగంగా చేపట్టిన 'పోషణ్ భీ, పడాయి భీ' అనే కార్యక్రమంపై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమం గురువారం చేపట్టారు. నియోజకవర్గం పరిధిలోని యలమంచిలి మండలం పులపర్తి, రాంబిల్లి మండలం కొత్తూరు, అచ్యుతాపురం మండలం పూడిమడక, మునగపాక మండలం తిమ్మరాజుపేట గ్రామాల్లో శిక్షణా కార్యక్రమాలు గురువారం మొదలైనట్లు యలమంచిలి సిడిపిఒ ఇందిరాదేవి తెలిపారు. బ్యాచ్‌కు 40 మంది అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజులుపాటు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రంజాన్‌బీబీ, సుహాసినీ తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది : రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని రావికమతం, రోలుగుంట, బుచ్చయ్యపేట, చోడవరం మండలాల్లో అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట జడ్పీ హైస్కూల్లో జరిగిన ఈ శిక్షణలో ఐసిడిఎస్ పిఒ ఎస్.పుష్పదేవి మాట్లాడారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజరాజేశ్వరి, సంతోషి, రత్నం పాల్గొన్నారు.

కె.కోటపాడు : కె.కోటపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 50 అంగనవాడీ కేంద్రాల కార్యకర్తలకు గురువారం శిక్షణ కార్యక్రమం ప్రారంభించినట్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి మంగతాయారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు ఎల్‌బి సుశీల, జి ఆదిలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



యలమంచిలిలో..



మంటలను అదుపుచేస్తున్న అగ్ని మాపక సిబ్బంది

పశువుల పాకలు దగ్ధం

- కాలిబూడిదైన మామిడి, టేకు, సరుగుడు తోటలు

- రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం

ప్రజాశక్తి-సబ్బవరం

సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు గొర్లివానిపాలెంలో గురువారం చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో వ్యవసాయ పొలంలోని 3 పశువులు పాకలు, ఒక గడ్డివాము అగ్ని ప్రమాదానికి గురై దగ్ధమయ్యాయి. మామిడి, టేకు, సరుగుడు తోటలు కూడా కాలిపోయాయి. పశువుల పాకకు మంటలు వ్యాపించడంతో రైతులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. మర్రిపాలెం అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ ఏ చిరంజీవి ఆధ్వర్యాన సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే గడ్డివాము పశువుల పాకలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో గొర్లి అప్పలనాయుడుకు చెందిన ఒక పశువులు పాక, ఒక గడ్డివాము, గొర్లి సత్యం చెందిన ఓ పశువుల పాక, గొర్లి నర్సిమూర్తికి చెందిన పశువులు పాక కాలి బూడిదయ్యాయి. గొర్లి సత్యం, కొటాన దేముడు, గండి బంగారయ్య, గండి కృష్ణ, కొల్లి రమణ, గొర్లి సత్యనారాయణ, గొర్లి కృష్ణమనాయుడు, గొర్లి నీలేశ్వరరావులకు చెందిన మూడు ఎకరాల మామిడి, టేకు, సరుగుడు తోటలు దగ్ధమయ్యాయి. అయితే పశువుల పాకలో ఉన్న పశువులకు ప్రమాదం తప్పింది. సుమారు 10 లక్షలు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు చెబుతున్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-మునగపాక : ప్రభుత్వ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఉషారాణి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె మండలలోని వివోఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 23న జరుగు ఉల్లాస్ పరీక్షలలో భాగంగా వివోఏలు ప్రభుత్వ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉచిత కుట్టమిషన్‌ల శిక్షణపై అర్హత ఉన్న మహిళలకు తెలియజేసి దరఖాస్తు చేయించాలని సూచించారు. బీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్ రుణాల గురించి దరఖాస్తు చేసుకొనేలా అందరికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వై.బాలరాజు, వివోఏలు పాల్గొన్నారు.



దగ్ధమైన తోట

జీడిమామిడి తోటలు దగ్ధం

ప్రజాశక్తి రావికమతం: మండలంలో చినపాచిల గ్రామంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో పలువురి రైతుల జీడి మామిడి తోటలుతో పాటు ఒక పశువుల పాక ఖాళీ బుడదయ్యాయి. వివరాలు ప్రకారం... గురువారం మధ్యాహ్నం చినపాచీల రైతు భరోసా కేంద్రం సమీపంలో ఉన్న కరెడ్ల సత్యారావు, శివయ్య నాయుడు, చిన సత్యారావు, నల్లప్పనాయుడు జీడి మామిడి తోటలు, కరెడ్ల దేవుళ్ళు పశువుల పాక ఖాళీ బుడదయ్యాయి. ఈ సమాచారాన్ని తెలుసుకున్న రావికమతం, మాడుగులకు చెందిన అగ్నిమాపక శకటం సిబ్బంది మంటలను అదుపు చేశాయి.ఏడాదికి ఒకమారు చేతికి వచ్చే జీడిమామిడి తోటలు పువ్వు, కాయ, పళ్ళతో ఉన్న చెట్లు కాలిపోవడంతో పూర్తిగా నష్టపోయినట్లు బాధిత రైతులు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.నష్టపరిహారం ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.



విత్తన ప్యాకెట్ ఇస్తున్న నరేష్

75శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు

ప్రజాశక్తి -కోటవురట్ల: పశుగ్రాసం సమస్యను అరికట్టేందుకు ప్రభుత్వం 75శాతం రాయితీపై ఎస్ ఎస్ జి జొన్నరకం గడ్డి విత్తనాలు అందుబాటులో ఉంచామని పశుసంవర్ధక శాఖ సహాయ చంచాలకులు డాక్టర్ నరేష్ తెలిపారు. గురువారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. 348 రూపాయలు విలువ చేసే విత్తనాలు 68 రూపాయలకు, మరో రకం 460 రూపాయలు విలువ గల విత్తనాలు 92 రూపాయలకు అందజేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

ఘనంగా మరిడిమాంబ తీర్థం

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల శివారులో మరిడిమాంబ అమ్మవారి తీర్థమహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కూటమి నాయకులతో పాటుగా అనకాపల్లి జిల్లా వైకాపా అధ్యక్షులు బూడి ముత్యాలనాయుడు అమ్మవారిని సందర్శించారు. ఎడ్ల బండ్ల పరుగు పోటీలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కార్మికులు

పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: గొలుగొండ మండలం ఏఎల్.పురం మేజర్ పంచాయతీలో గురువారం ఈవోపిఆర్‌డి కే.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. పారిశుద్య సిబ్బంది గ్రామంలోని అన్ని వీధుల్లో పిచ్చిమొక్కలను తొలగించి చెత్తా చెదారంను ఎత్తివేశారు. ఈవోపిఆర్డి మాట్లాడుతూ, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలన్నారు. చెత్తను రోడ్లపై వేయరాదని చెప్పారు.

ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని సిహెచ్ లక్ష్మీపురం లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో డి.సీతారామరాజు పరిశీలించారు. పని వివరాలు, కూలీల మస్తర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజు వేతనం 300 రూపాయలు వచ్చే విధంగా పని చేయాలని సూచించారు. కూలీలకు రోజుకు 300 రూపాయలు వచ్చే విధంగా పని కల్పించాలని వీఆర్పీకి సూచించారు. ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా పక్కాగా పనులు చేపట్టాలన్నారు. ఎండ తీవ్రత దృష్టిలో పెట్టుకొని పని చేయాలని, తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ సీతారామరాజు

భూ సమస్యపై వినతి



వినతిపత్రాన్ని ఇస్తున్న బాధితులు

ప్రజాశక్తి -కోటవురట్ల: తమ భూమిని అప్పగించాలని తహసిల్దార్ తిరుమలబాబుకు గురువారం కోటవురట్ల గ్రామానికి చెందిన గుర్రం గోవింద కుటుంబ సభ్యులు మొరపెట్టుకున్నారు.బాధితుల కథనం మేరకు.... గ్రామంలో కోదండ రామస్వామి గుడి సమీపంలో ఉప్పర వీధి వద్ద మా పూర్వీకుల దగ్గర నుండి నివాసం ఉండే వారమన్నారు. బతుకు తెరువుకై విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం జీవనం సాగిస్తున్నామన్నారు. గ్రామంలో సర్వేనెంబర్ 137-9, 138-10లో0- 68 ఎకరాల భూమిని ఓ వ్యక్తికి తమ పూర్వీకులు 10000 రూపాయలకు తాకట్టు పెట్టగా నాటి నుంచి వాళ్లే సదరు భూమిని సాగు చేసుకుంటున్నారన్నారు. తమ భూమి అప్పగించాలని పలుమార్లు కోరితే తమపై ఎదురుదాడికి దిగే వారన్నారు. గతంలో కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు ఫిర్యాదు చేశామని సమగ్ర విచారణ చేపట్టి తమ భూమి అప్పగించాల్సిందిగా ఫిర్యాదుదారులు కోరారు. స్పందించిన తహసిల్దారు సమగ్ర విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని ఆర్ఐకి సూచించారు. తదనంతరం మండల కోఆర్డినేషన్ కమిటీలో విచారణ చేపట్టేందుకు ఇరు వర్గాలకు సమాచారం ఇవ్వాలని ఆయన ఆదేశించారు.

రెల్లిలకు రిజర్వేషన్ పెంచాలని 22న ర్యాలీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న నర్సీపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు తెలిపారు. గురువారం నర్సీపట్నం మండలం చెట్టుపల్లి రెల్లివీధిలో రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాపారావు మాట్లాడుతూ, 22న ఉదయం 10 గంటలకు సిబిఎం కాంపౌండ్ వద్ద ర్యాలీ ప్రారంభమైన ఏరియా ఆసుపత్రి, పోలీస్‌స్టేషన్, అబీద్ సెంటర్, పాల్ ఘాట్ సెంటర్, ఆర్డీవో కార్యాలయం మీదుగా ఆర్టీసి కాంప్లెక్స్, శ్రీకన్య జంక్షన్ వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు తీరని అన్యాయం చేశారన్నారు. అణగారిన రెల్లి కులానికి 5శాతం రిజర్వేషన్ వాటా పెంచి సామాజిక సమన్యాయం చేస్తారని ఆశించామని, నిరాశే మిగిలిందన్నారు. ర్యాలీలో విద్యార్థి సంఘాలు, నిరుద్యోగ యువత, రిటైర్డు ఉద్యోగులు హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో రెల్లి సంఘ నాయకులు యర్రంశెట్టి అప్పన్నబాబు, జిల్లా నాయకులు ఇల్లపు లోవరాజు, డివిజన్ నాయకులు చిన్నబ్బాయి కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు పాపారావు

బాలికల హాస్టల్ భవనానికి స్థలం పరిశీలన

ప్రజాశక్తి- అనకాపల్లిడెస్క్: గొలుగొండ మండలం ఏఎల్.పురంలో బాలికల వసతి గృహ నిర్మాణానికి సంబంధించి గురువారం తహశీల్దార్ పీ.శ్రీనివాసరావు, నాడు నేడు జేఈఈ సత్యనారాయణ స్థల పరిశీలన చేశారు. హాస్టల్ నిర్మాణానికి అనువైన స్థలంపై ఆరా తీశారు. ఈ వసతి గృహ నిర్మాణానికి రూ.2.12కోట్ల నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, ఎంపిటిసి రుత్తల రామకృష్ణ, నాయకులు బొడ్డు జమీలు, లగుడు రమేష్, అప్పలనాయుడు, సన్నిబాబు, స్వామినాయుడు, వీఆర్వో రాజు పాల్గొన్నారు.



పరివీలిశీలిస్తున్న అధికారులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని బుచ్చిరాజుపేట పంచాయతీ నల్లమట్టిపాలెం గ్రామానికి చెందిన నల్లమట్టి రాము (54) అనుమానస్పదంగా మృతి చెందినట్లు మృతిని కుమారుడు దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సన్ని బాబు తెలిపారు. నల్లమట్టి రాము బుధవారం సాయంత్రం కల్లు తాగేందుకు రాజయ్యపేట వెళ్లాడు. గురువారం ఉదయం కల్లు విక్రయించే పాకల వద్ద రాము మృతదేహం ఉండడంతో స్థానికులు రాము కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు సంఘటన ప్రాంతానికి చేరుకుని, రాము మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భూ వివాదంలో ఘర్షణ

ప్రజాశక్తి -రావికమతం: భూ వివాదంలో మేడివాడ గ్రామానికి చెందిన కేశం శెట్టి, సీతిన కుటుంబాల మధ్య గురువారం వివాదం చోటు చేసుకుంది.దీంతో ఇరు కుటుంబాల వ్యక్తులు కొట్లాటలో గాయాలపాలయ్యారు. కేశం శెట్టి శేషు, గణేషులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసుల సంఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ బాధితులను నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఇరు వర్గాల వారిపై కేసు నమోదు చేసినట్లు రావికమతం ఎస్సై రఘువర్మ తెలిపారు.

రహదారుల పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: గొలుగొండ మండలం పాతమల్లంపేట పంచాయతీ కొత్తపాలెం, అచ్చంపేట, బుడ్డడపాడు, నిమ్మగెడ్డ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మీ ఆనంద్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక చొరవతో రూ.30లక్షలతో ఈ రోడ్ల నిర్మాణాలు చేయడం జరుగుతుందన్నారు. ఇప్ప టికే రూ. 38లక్షలతో పంచాయతీలోని హుకుంపేట, భీమునిపట్నం, చిన జగ్గంపేట గ్రామాల్లో సీసీ రోడ్లు పూర్తయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గెడ్డం నానాజీ, వార్డు మెంబర్లు బిడిజాన పోతురాజు, అడ్డూరు బంగారమ్మ, మజ్జి స్వాములు, రుత్తల సత్యనారాయణ, మాకిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్




మాట్లాడుతున్న తహశీల్దార్

రెవెన్యూ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి- కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాల్లో అందిన రెవిన్యూ ఫిర్యాదులతో పాటు వివిధ సమస్యల పట్ల నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని తహసిల్దార్ తిరుమల బాబు సూచించారు. గురువారం రెవెన్యూ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అర్హులకు అందించాల్సిన ఎల్పీసీలు సహా రేషన్ కార్డు దారులకు ఈపీకేవైసీ పట్ల నిర్లక్ష్యం చేయకుండా గ్రామస్తులకు అందుబాటులో ఉండి పని చేయాలని సూచించారు. పిజిఆర్ఎస్ సమస్యలను ప్రధానంగా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. పొందూరు గ్రామ రెవెన్యూ అధికారి సంజయ్ రాజు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిటి రమేష్, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి- మాడుగుల: బాల కార్మికుల తనిఖీలలో భాగంగా సహాయ కార్మికాధికారి పి.సూర్యనారాయణ ఘాటీరోడ్డు కూడలిలో ఉన్న పలు దుకాణాలలో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ దాడుల్లో రెండు దుకాణాలపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. విజయ ఇంజినీరింగ్ వర్కుషాపు, క్రేజీ జ్యూస్ షాప్లో బాల కార్మికులు పని చేస్తున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. బాలకార్మికులకు తక్కువ జీతం ఇస్తున్నట్లు తెలుసుకున్నామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండని పిల్లలకు పనిలో పెట్టవద్దని సహాయకార్మికాధికారి తెలిపారు.



తనిఖీ చేస్తున్న అధికారి

టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి -కొత్తకోట: టీడీపీ సభ్యత్వ నమోదు ఐడి కార్డులు కార్యకర్తలకు అత్యంత కీలకమని రావికమతం టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు రాజన కొండనాయుడు అన్నారు. గురువారం మండలం దొండపూడి, టి అర్జా పూరం,మత్యవాణిపాలెం, మర్రివలస, కిత్తంపేట తదితర గ్రామాలలో సభ్యత్వ నమోదు కార్డులను అంద జేశారు. ఈ సందర్భంగా కొండ నాయుడు మాట్లాడుతూ మండలంలో 28 పంచాయతీలలో వివిధ గ్రామాలకు చెందిన 16,500 మంది కార్యకర్తలు సభ్యులుగా చేరారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.పాల్గొణ, మాజీ ఎంపిటిసి బంటు శ్రీను, పార్టీ నాయకులు ఆచారి పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా ఈ నెల 24,25 తేదీలలో బ్యాంకు ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు సిఐటియు విశాఖ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, టెంపరరీలను రెగ్యులర్ చేయాలని, ద్వైపాక్షిక ఒప్పందాలకు తూట్లు పొడుస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ యుఎఫ్‌బియు నాయకత్వంలో ఉద్యోగులు, అధికారులు ఐక్యంగా చేస్తున్న సమ్మె పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. పర్మినెంట్ ఉద్యోగుల స్థానంలో ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులను ప్రవేశపెడుతున్నారని, ఉద్యోగ సంఘాల ఉనికినే ఈ పరిణామాలు సవాలు చేస్తున్నాయని తెలిపారు. ఇటువంటి పరణామాలు తీసుకొచ్చే లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు మే 20వ తేదీన జాతీయ సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. ఈ పోరాటంలో బ్యాంకు ఉద్యోగులు కూడా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కీలక రంగాలన్నింటినీ కార్పొరేట్ కంపెనీల కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని, ఈ ప్రైవేటీకరణ విధానాలను ఎదుర్కొని ప్రభుత్వరంగాన్ని కాపాడు కావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు.

పోలీస్ కమిషనరేట్‌లో రికవరీ మేళా

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో 2025 ఫిబ్రవరి నెల రికవరీ మేళాను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రాత బాగ్చి మాట్లాడుతూ, 2025 ఫిబ్రవరి నెలలో 109 కేసులు నమోదయ్యాయని, అందులో 73 కేసులను విజయవంతంగా ఛేదించామని, 103 మందిని అరెస్టు చేశామని తెలిపారు. చోరీ సొత్తులో రూ.33,21,435 విలువగల వస్తువులు, నగదుతోపాటు రూ.60,00,000 విలువ గల 400 మొబైల్ ఫోన్లను కలుపుకుని మొత్తం రూ. 93,21,435 విలువగల సొత్తును రికవరీ చేసినట్లు చెప్పారు. రికవరీ చేసిన వస్తువులను మేళా ద్వారా బాధితులకు అందజేస్తున్నట్లు వివరించారు. ఫిబ్రవరిలో రికవరీ చేసుకున్న సొత్తులో 660.655 గ్రాముల బంగారం, 2008.3 గ్రాముల వెండి, రూ.2,73,575 నగదు, 14 ద్విచక్ర వాహనాలు, 419 (దొంగిలించ బడినవి 19, పోగొట్టుకున్నవి 400) మొబైల్ ఫోన్లు, 2 ల్యాప్ టాప్‌లు, 2 గేదెలు, 3 లారీ బ్యాటరీలు, సెంటరింగ్ షీట్స్ 57 ఉన్నాయని తెలిపారు. నగరవ్యాప్తంగా ఫిబ్రవరిలో నూతనంగా 751 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, 203 క్రైమ్ అవేర్నెస్ క్యాంపులు నిర్వహించామని చెప్పారు. రాత్రి వేళలో గస్తీ నిర్వహణను మరింత పటిష్టం చేశామన్నారు.



రికవరీ సొత్తును అందజేస్తున్న కమిషనర్

నగర అధికారులు రూపొందించిన చాట్ బాట్ ద్వారా ఇప్పటివరకు రూ.7.60 కోట్ల విలువగల 5,069 మొబైల్ ఫోన్లను తిరిగి పోగొట్టుకున్న వారికి అందించినట్లు తెలిపారు. విశాఖ నగర పరిధిలో ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే 9490617916 నెంబర్‌కు చాట్ బాట్ ద్వారా లేదా సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదులు నమోదు చేయాలని కమిషనర్ సూచించారు. మీడియా సమావేశంలో క్రైమ్ డిసిపి కె.లతా మాధురి, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేవీ ప్రభావిత రైతుల సమస్యలను పరిష్కరించాలి

-సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం -పలు గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర

ప్రజాశక్తి-రాంబిల్లి

మండలంలో నేవీ ప్రభావిత రైతుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని చిన్న కలవలపల్లి, కొత్తపేట, జెడ్ చింతవ తదితర గ్రామాలు లోకనాథం పర్యటించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ పూర్వీకులు నుండి కొండ పోరంబోకు భూముల్లో జీడిమామిడి, కొబ్బరి, యూకలిప్టస్ వంటి తోటలు, ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు వంటి జీవాలను పెంపకం, కళ్ళు గీత కార్మికులు తాటి, ఈత చెట్లు కళ్ళు గీసుకుని, పేదలు ఎండు కట్టులు కొట్టుకొని వచ్చే ఆదాయంతో జీవనం సాగించేవారని రైతులు తెలిపారు. కొండ చుట్టూ నేవీ ప్రహరీ గోడ నిర్మించడంతో ఆయా ప్రజల జీవనాధారం పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రహరీ వల్ల అచ్చుతాపురం, ఎలమంచిలికి వెళ్లే అడ్డుదారి కోల్పోతున్నామని, తాగునీరు, జరాయితీ పంట భూములకు రహదారులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను జిల్లా కలెక్టర్, ఫారెస్టు అధికారులు పరిష్కరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. చిన్న కలవలపల్లి, కొత్తపేట, జెడ్ చింతవ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఐదు నుంచి 8 వారాలు వరకు కూలి డబ్బులు ఇవ్వలేదని కూలీలు మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జి దేముడు నాయుడు, నాయకులు ఎన్ నారాయణరావు, వై రాము, సిహెచ్ రామకృష్ణ, ధోని కాసియా, ఉపాధి కూలీలు, నేవీ బాధిత రైతులు పాల్గొన్నారు.


అచ్యుతాపురంలో....


మాట్లాడుతున్న కోటేశ్వరరావు

జీడిమామిడిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి జీ.కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: గొలుగొండ మండలంలోని అడ్డలోవ, సుద్దలపాలెం, ఎన్.గదబపాలెం, జోగుంపేట గ్రామాల్లో సిపిఎం ప్రజాచైతన్య యాత్రలు నిర్వహించారు. ముందుగా విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా విద్యుత్ బిల్లులను గురువారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జీ.కోటేశ్వరరావు మాట్లాడుతూ, కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు తక్షణమే అమలు చేయాలన్నారు. జీడిమామిడి పంటకు అగ్గి తెగులు ప్రబలిందని, ప్రభుత్వం ఇన్స్యూరెన్స్ కల్పించాలన్నారు. కనీస మద్దతు ధర రూ.16000 ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కూలీ పనులు 200 రోజులు కల్పించి రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, మండల కార్యదర్శి ఎం.రాజు, శివ, బెన్నేష్, జోగురాజు తదితరులు పాల్గొన్నారు.

దుప్పుతూరు, చినపూడి గ్రామాలను తరలించాలి

అచ్యుతాపురం : సమస్యల వలయంలో చిక్కుకున్న దుప్పుతూరు, చిన్నపూడి గ్రామాలను తరలించాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్ర గురువారం దుప్పుతూరు, చిన్నపూడి గ్రామాల్లో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 20 సంవత్సరాలుగా ప్రభుత్వ సహాయం కొరకు ఎదురు చూస్తున్నట్లు నిర్వాసితులు తెలిపారు. పునరావాసం కల్పించక రేకుల షెడ్డులలో తల దాచుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము, నాయకులు కె సోమునాయుడు, అప్పలరావు, ఉసా అప్పారావు, లాలం అచ్చియమ్మ తదితరులు పాల్గొన్నారు.

30ఏళ్లుగా నివాసముంటున్నా ఇళ్ల పట్టాలు ఇవ్వరేం?

మధురవాడ :30ఏళ్లుగా పాకలు వేసుకుని నివాసముంటున్నా తమకు ఇళ్లపట్టాలు గానీ, తమ కాలనీలకు కనీస సౌకర్యాలను గానీ ప్రభుత్వపరంగా కల్పించడం లేదని కొమ్మాది, దేవీమెట్ట దరి ఎస్‌సి కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సిపిఎం ప్రజాచైతన్యయాత్రలో భాగంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, డి.అప్పలరాజు ఆధ్వర్యంలోని సిపిఎం బృందం ఆయాప్రాంతాల్లో పర్యటించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాము నివాసముంటున్న పాకల స్థానే రేకుల షెడ్‌లు వేసుకుందామన్నా, ఇళ్లు నిర్మించుకుందామన్నా ఒప్పుకోవడం లేదని, సర్వేచేసి వెళ్లిన అధికారులు పట్టాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టడం లేదని వాపోయారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్ పైడితల్లి, ఎస్ పోలరాజు, కె.పుష్ప, ఎస్ బంగారి, చిన్న, ఎస్ పైడమ్మ, అప్పారావు పాల్గొన్నారు.

200 అడుగులకు రోడ్డు వెడల్పు వద్దు

ఆనందపురం : విఎంఆర్‌డిఎ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా వేములవలస క్రాస్ రోడ్డు నుంచి భీమునిపట్నం వరకు రోడ్డును 200 అడుగుల వెడల్పుకు విస్తరిస్తే అనేకకుటుంబాలు రోడ్డున పడి నిలువనీడ లేకుండా పోతారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సిపిఎం ప్రజా చైతన్యయాత్రలో భాగంగా పార్టీ భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు, జోన్ కమిటీ నాయకులు ఎస్ అప్పలనాయుడు ఆధ్వర్యంలో సిపిఎం బృందం ఆయా ప్రాంతాలను సందర్శించగా, స్థానికులు పలు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా భీమిలి, దొరతోట రోడ్డు విస్తరణతో అడ్డురోడ్డు నుండి బొడ్డపాలెం, గొల్లలపేట, మన్యాలపేట, తదితర గ్రామాల వద్ద రోడ్డుకిరువైపులా సుమారు 500 కుటుంబాలు 40ఏళ్లుగా చిన్నవ్యాపారాలతో జీవిస్తున్న వారంతా రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. వంద అడుగుల రోడ్డు విస్తరణకు ప్రతిపాదించి, ఇపుడు 200 అడుగులు వెడల్పు చేసేందుకు నోటీసులు ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణ నిలుపుదల చేయాలని బొడ్డపాలెం కూడలిలో బాధితులు, రైతులు చేపట్టిన ఆందోళనకు సిపిఎం బృందం సంఘీభావం తెలిపింది. కార్యక్రమంలో బాధితులు బి శ్రీదేవి, రవితేజ, ప్రసాదు, జగన్ రెడ్డి, వెంకటరావు, వీరన్న జి.రమణి రమణ, కె.నర్సమ్మ, సిహెచ్ అమ్మాజీ పాల్గొన్నారు.


ఆనందపురంలో...

ములగాడ : జివిఎంసి 62వ వార్డు త్రినాధపురంలో సిపిఎం కార్యకర్తలు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. బృందాలుగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలపై సర్వే చేశారు. ఇల్లు, ఇళ్ల బిల్లులు, అధిక విద్యుత్‌ఛార్జీలు, ఉచిత గ్యాస్ డబ్బులు పడకపోవడం, తదితర సమస్యలు సిపిఎం బృందం దృష్టికివచ్చాయి.కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి పైడిరాజు. జోన్ నాయకులు పిసిని. రామారావు, కార్యకర్తలు బగ్గం ప్రసాద్, బి. జగ్గునాయుడు, మోహన్, గాంధీ, శ్రీను, పి. పుణ్యవతి పాల్గొన్నారు.

పెందుర్తి : సిపిఎం ప్రజాచైతన్యయాత్రలో భాగంగా అప్పలనర్సయ్యకాలనీ, అప్పన్నపాలెంలో పార్టీ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు ఆధ్వర్యంలో పార్టీ నేతలు బృందంగా ఇంటింటా సమస్యలపై సర్వే చేశారు. అప్పల నరసయ్య కాలనీలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను స్థానికులు విన్నవించగా, ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు పడలేదని పలువురు బిటెక్ విద్యార్థులు విన్నవించారు. అప్పన్నపాలెం వాంబే కాలనీలో ఇళ్లకు రంగులు, మరమ్మతులు చేయకపోవడంతో శిథిలావస్థకు చేరాయని స్థానికులు విన్నవించారు.కార్యక్రమంలో సిపిఎం పార్టీ జోన్ కార్యదర్శి జగన్ సిపిఎం నాయకురాలు వీరమని సిఐటి నాయకులు అప్పలనాయుడు శంకరరావు తదితరులు పాల్గొన్నారు


సమస్యలను తెలుసుకుంటున్న జగ్గునాయుడు

అదానీ గంగవరం పోర్టు కాలుష్యం నుంచి రక్షణ కల్పించాలి

-సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి -గాజువాక : అదానీ గంగవరం పోర్టు కాలుష్యం నుంచి రక్షణ కల్పించాలని జివిఎంసి 65వ వార్డు పరిధి వాంబాయ్ కాలనీ, భానోజీతోట వాసులు మొరపెట్టుకున్నారు. సిపిఎం ప్రజాచైతన్యయాత్రల్లో భాగంగా గురువారం పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఆధ్వర్యంలోని సిపిఎం బృందం ఆయా ప్రాంతాల్లో పర్యటించి, ఇంటింటా ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారురీ సందర్భంగా గంగవరం పోర్టు కాలుష్యంతో ఏళ్లతరబడి నానా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే దిక్కులేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటిపన్నులు, విద్యుత్‌ఛార్జీల పెంపు, రోజుకు పావుగంటకు మించిరాని జివిఎంసి కుళాయినీటితో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు విన్నవించారు. అర్హులందరికీ ఇంటిపట్టాలు, ఇళ్లు, రేషన్‌కార్డులు, పింఛన్లు లేవని విన్నవించారు. దీనిపై సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు స్పందించి, ప్రజాచైతన్యయాత్రలో సేకరించిన సమస్యల పరిష్కారానికి అధికారులకు విన్నవించడంతోపాటు అవసరమైతే ఆందోళన చేపడదామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, వార్డు కార్యదర్శి ఆర్ నాగేశ్వరరావు, జోన్ నాయకులు బంగారునాయుడు, గొలగాని అప్పారావు వార్డు నాయకులు ఎం నాగేశ్వరరావు, బి శ్రీనివాసరావు, టి శ్రీనివాసరావు, వై త్రినాథ్, నాగరాజు, భుజంగరావు, అప్పారావు పాల్గొన్నారు.